క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

పోరుమామిళ్ల : పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెసల నరసింహులు మాట్లాడుతూ మహాలక్ష్మికి శాశ్వతంగా ప్రతి శుక్రవారం కుంకుమార్చన చేసేందుకు విరాళాలు సేకరించామన్నారు. శుక్రవారం నుంచి కుంకుమార్చన కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు.

రాజుపాళెం : మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటా చలపతి తెల్లవారుజామునే 303 నిమ్మకాయలతో దండ, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, భక్తులు పార్వతీదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డ్వాక్రా మహిళలకు రూ.10 కోట్ల రుణాలు

కాశినాయన : పొదుపు సంఘాల మహిళలకు రూ.10.62 కోట్ల రుణాలు అందించామని ఏపీఎం వీరాంజనేయులు తెలిపారు. వెలుగు కార్యాలయంలో 15వ వార్షిక సభను మండల సమాఖ్య అధ్యక్షురాలు బీబీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 556 పొదుపు సంఘాలకు రుణం ఇచ్చామన్నారు. స్త్రీనిధి ద్వారా 67 సంఘాలకు రూ.1.25 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా 649 సంఘాలకు రూ.5.96 కోట్లు నాలుగు విడతలుగా ప్రభుత్వం అందించిందన్నారు. ఈ సమావేశంలో లీగల్ కో ఆర్డినేటర్ రవికుమార్, స్త్రీనిధి మేనేజర్ సుబ్రహ్మణ్యం, పోరుమామిళ్ల ఏపీఎం అశోక్‌రెడ్డి, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నూర్ మహమ్మద్‌ను సన్మానిస్తున్న నాగూర్, పడిదేల దస్తగిరి తదితరులు

ప్రొద్దుటూరు క్రైం : రాజకీయ ప్రాధాన్యత కల్పించడం ద్వారా నూర్‌బాషా దూదేకులు అభివృద్ధి చెందుతారని నూర్‌బాషా దూదేకుల సంఘం వ్యవస్థాపకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రొద్దుటూరుకు విచ్చేసి దూదేకుల సంఘం సీనియర్ నాయకులు, గౌతమి ఇంజినీరింగ్ కాలేజి ప్రెసిడెంట్ నాగూర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరిలను కలిశారు. ఈ సందర్భంగా వారు దూదేకుల సంఘం అభివృద్ధి గురించి చర్చించారు. కుల అభివృద్ధి జరగాలంటే ఖచ్చితంగా రాజకీయ ప్రాధాన్యత అవసరమని చెప్పారు. పగిడేల దస్తగిరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఈ సారి నూర్‌బాషాలకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి ప్రోత్సహిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నూర్ మహమ్మద్‌ను సన్మానించారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే తమ లక్ష్యమని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోసు పేర్కొన్నారు. ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ప్రకటించిన నేపథ్యంలో స్థానిక డిపో గేటు ఎదుట ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బోసు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా చేసిన పోరాటాల ఫలితంగానే గుర్తింపు లభించిందన్నారు.

రంగులద్దారు.. వేడుకలకు సిద్ధం చేశారు

- చవితి ఉత్సవాలకు తయారైన గణేశుడి ప్రతిమలు
- 18 నుంచి వాడవాడలా కనిపించనున్న పండుగ శోభ
- మూడు రోజులపాటు పూజలందుకోనున్న విఘ్నేశుడు



మైదుకూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయకుని విగ్రహాలు

మైదుకూరు : వినాయక చవితి పండుగను ఘనంగా జరపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 18న పండుగను జరుపుకోనున్నారు. ఇందు కోసం పలు చోట్ల ఆకర్షణీయమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకుడి విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. మైదుకూరులో పలు చోట్ల రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు రంగురంగుల ఆకర్షణీయమైన వినాయకుడి విగ్రహాలను తయరు చేశారు. గతంలో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల నుంచి విగ్రహాలను కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. గత కొన్నేళ్లుగా మైదుకూరులోనే రాజస్థాన్‌కు చెందిన కొందరు విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుండటంతో పండుగ నిర్వాహకులు స్థానికంగానే వాటిని కొనుగోలు చేసి మండపాల్లో కొలువుదీరుస్తున్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డులో వినాయకుని విగ్రహాలను తయారు చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన రితేష్ కుమార్ మాట్లాడుతూ తమ వద్ద రూ. 3వేల నుంచి రూ.30వేలు విలువజేసే విగ్రహాలను తయారుచేసి విక్రయిస్తున్నామన్నారు. మైదుకూరు ప్రాంతంలో ఏటా పండుగ ఘనంగా జరుగుతోందని అన్నారు. ఈ ఏడాది కూడా పండుగను ఘనంగా జరుపుకొనేందుకు ఇప్పటికే మండపాల ఏర్పాట్లను ప్రారంభించారు. పట్టణంలోని అక్కడక్కడ భారీ విగ్రహాలను నెలకొల్పనున్నారు.

మట్టి విగ్రహాలకూ గిరాకీ

వినాయక చవితి పండుగకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసే విగ్రహాలతో పాటు మట్టి విగ్రహాలకూ గిరాకీ ఉంటుంది. మండపాల్లో నెలకొల్పే భారీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతోపాటు ఇళ్లల్లో పెట్టి పూజించేందుకు ప్రజలు మట్టి విగ్రహాలను కూడా కొనుగోలు చేస్తుంటారు. మైదుకూరు, పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన కళాకారులు ఒక అడుగు నుంచి 5 అడుగుల వరకు ఉండే మట్టి విగ్రహాలను తయారు చేసి వాటికి ఆకర్షణీయంగా రంగులు వేసి, పండుగకు ఒక రోజు ముందు నుంచి పట్టణంలోని రాయల కూడలిలో విక్రయిస్తుంటారు. చిన్న పిల్లలు భక్తి ప్రపత్తులతో పెద్దవారి వద్ద చందాలు తీసుకుని తమ వీధుల్లో ఏర్పాటు చేసుకునేందుకు ఈ మట్టి విగ్రహాలను కొనుగోలు చేస్తారు. నిమజ్జనం రోజు మట్టి విగ్రహాలను మండపాల్లోని పెద్ద విగ్రహాల వద్దకు చేర్చి వాటితోపాటు నిమజ్జనం చేస్తారు. మైదుకూరులో రెండు, మూడు రోజులపాటు పండుగను నిర్వహిస్తారు. మూడో రోజు ట్రాక్టర్లలో, ఇతర వాహనాలలో గణపయ్యను భాజా భజంత్రీల నడుమ పట్టణంలో ఊరేగిస్తూ సమీపంలోని కుందూ నదిలో నిమజ్జనం చేస్తారు.

రూ.30.20 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



రహమతుల్లాకు రూ.25.70 లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలోని కూరగాయల మార్కెట్ వ్యాపారి షేక్ రహమతుల్లా (హబ్బులు)కు రూ.25.70లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే గురుదేవ్ రామిరెడ్డికి రూ.4.50 లక్షల చెక్కు అందించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రహమతుల్లా సతీమణి ఫమీదాకు ఆరు నెలల క్రితం ఇద్దరు కవల పిల్లలు జన్మించారన్నారు. బాలికలు అతి తక్కువ బరువుతో జన్మించారన్నారు. తల్లిదండ్రులు అప్పోసొప్పో చేసి వీరికి హైదరాబాద్‌లో వైద్యం చేయించారన్నారు. తనకు ఆప్తుడైన హబ్బులు విషయాన్ని తెలపగా చిన్నారుల వైద్యానికి అయిన బిల్లులను తీసుకుని స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. మానవతా హృదయం కలిగిన ఆయన పూర్తి మొత్తాన్ని రూ.25.70 లక్షలు చెల్లించారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనకు సీఎంఆర్‌ఎఫ్ ఇప్పించినందుకు ఎమ్మెల్యేకు, సీఎంకు రహమతుల్లా కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి ఉపయోగపడని వారికి ఓట్లేస్తే నష్టపోతారు

ప్రొద్దుటూరు : అభివృద్ధికి ఉపయోగపడని నేతలకు ఓట్లేస్తే మీరే నష్టపోతారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో 14 స్వయం సహాయక సంఘాలకు శుక్రవారం రూ.18,57,081 చెక్కులను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నారన్నారు. జగనన్న అమ్మ ఒడి, నాడు-నేడు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని 54వేల మంది డ్వాక్రా మహిళలకు ఇప్పటి వరకు మూడు విడతలుగా రూ.120 కోట్లు రుణమాఫీ జరిగిందని, నాలుగో విడత డబ్బు వచ్చే ఏడాది మీ ఖాతాల్లో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మెప్మా టీఈ కెజియా జాస్లిన్, కౌన్సిలర్ కమాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు వద్ల దాదాపీర్, బాలకృష్ణ, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల్లో ఆనందం నింపాం



లబ్ధిదారురాలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం నింపగలిగామని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వల్లెరవారిపల్లె, బుచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.130 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామంలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటా తిరిగి పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు సహకరించాలని కోరారు. ఆకులనారాయణపల్లె ఎస్సీకాలనీ వాసులు నూతనంగా నిర్మించుకున్న జగనన్న గృహాలకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులతో మాట్లాడి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరెడ్డి, రాములమ్మ, చిత్తారాజశేఖర్‌రెడ్డి, హరినాథరెడ్డి, చిన్నశేషారెడ్డి, కె.వెంకటరెడ్డి, చిన్ననర్సిరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతకుంట సచివాలయం-2 పరిధిలో అరుంధతి నగర్, మీర్జఖాన్‌పల్లె, సంగటితిమ్మాయపల్లె గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ఒక కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే తెలిపారు. పేదలకు సాయం చేయాలన్న పెద్ద మనసు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని మరో మారు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అరంధుతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేసి పిల్లలతో మాట్లాడారు. వారికి అందుతున్న పోషకాహారం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సచివాలయల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి, స్థానిక నేతలు కోగటం వీరారెడ్డి, లింగేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు ప్రబాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కోసం స్థలం కేటాయించాలని వినతి

మైదుకూరు: ప్రెస్ క్లబ్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని, మైదుకూరు నియోజకవర్గ, మండల పాత్రికేయులు కలెక్టర్ వి.విజయరామరాజుకు జగనన్న చెబుదాం కార్యక్రమంలో విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర సమాచార కమిషనర్ నుంచి అనుమతి తెచ్చుకుంటే మైదుకూరులో తప్పకుండా ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు స్థానిక తెలుగు గంగ కాలనీలో నిరుపయోగంగా ఉన్న ఒక భవనాన్ని ప్రెస్ క్లబ్ నిర్వహణ కోసం కేటాయిస్తామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఆ మేరకు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. మున్సిపల్ చైర్మన్ చంద్ర, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులదే భద్రత బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులే తగిన భద్రత కల్పించుకోవాలని రూరల్ సీఐ రమణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వినాయక కమిటీ సభ్యులతో శుక్రవారం సాయంత్రం సీఐ సమావేశం నిర్వహించారు. విగ్రహాలు నిలపడానికి పోలీసుల అనుమతి తప్పని సరి అన్నారు. సమావేశంలో ఎస్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ యుగంధర్, త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్ అన్నారు. పట్టణంలోని హోమస్‌పేట, గాంధీరోడ్డులలో శుక్రవారం సాయంత్రం సీఐలు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సెంట్రల్ పార్కింగ్‌లో నిలిపిన కార్లు, ఇతర వాహనాలకు జరిమానా విధించారు.

పార్కింగ్ సమస్యను పరిష్కరించండి

ప్రొద్దుటూరు క్రైం : సెంట్రల్ పార్కింగ్‌తో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్రాఫిక్ సీఐ యుగంధర్‌కు వినతిపత్రం అందచేశారు. పట్టణంలోని కోనేటికాల్వవీధి, శివాలయంవీధి, హోమస్‌పేట ప్రాంతాల్లో సెంట్రల్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. రహదారి మధ్యలో బైక్‌లతో పాటు ఆటోలు, ఇతర వాహనాలను పర్మినెంట్‌గా నిలుపుకుంటున్నారని, దీని వల్ల ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన సీఐకి వివరించారు. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనాలన్నీ రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సి వస్తుందన్నారు. అంబులెన్స్‌లు, స్థానికుల అవసరాల నిమిత్తం భారీ వాహనాలు వచ్చిన సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వాహనాలను నిలిపేందుకు ప్రత్యేక స్థలాలను గుర్తించాలని ఆయన కోరారు.

'మోక్షగుండం' దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజనీరు



చాపాడు: మాట్లాడుతున్న ఇస్రో మాజీ జనరల్ మేనేజర్

చాపాడు : మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశం గర్వించదగ్గ గొప్ప సివిల్ ఇంజనీరు అని ఇస్రో మాజీ జనరల్ మేనేజర్ గోపాల కృష్ణ పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి పురస్కరించుకుని 56వ ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య గొప్ప సివిల్ ఇంజనీర్‌గా నిర్మించిన ఎన్నో అద్భుత కట్టడాలు నేటికి స్థిరంగా ఉన్నాయన్నారు. కృష్ణరాజ సాగర్ ప్రాజెక్టు, బృందావన గార్డెన్, తిరుమల ఘాట్ రోడ్ వంటివి విశ్వేశ్వరయ్య నిర్మించినవేనన్నారు. సీబీఐటీ చైర్మన్ డా.వి.జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారత దేశం ఎంతో అభివృద్ధిని సాధించిందంటే అందుకు కారణం విశ్వేశ్వరయ్య లాంటి గొప్ప వ్యక్తులేనన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి. శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో..

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజిలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజి విద్యార్థినులు ప్రదర్శించిన నమూనాలు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తిలకించారు.

- మండల పరిధిలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మోక్షగుండం జయంతి సందర్భంగా ఇంజనీరింగ్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇంజనీరింగ్ సూపరింటెండెంట్ సి.రమేష్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు తదితరులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

డివిజన్‌లో రూ.10.74 కోట్ల విద్యుత్ బకాయిలు



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్‌ఈ ఎస్.రమణ

మైదుకూరు : మైదుకూరు విద్యుత్ డివిజన్‌లో రూ.10.74 కోట్ల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, వాటిని వసూలు చేయడంపై అధికారులు దృష్టి సారించాలని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. మైదుకూరులోని డివిజన్ కార్యాలయంలో శుక్రవారం మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి లోపల ఉన్న విద్యుత్ మీటర్లు బయటకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. మీటర్ సర్వీస్ వైరు స్తంభం నుంచి మీటర్ వరకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లులపై వచ్చే వ్యత్యాసాలు అధిగమించడానికి ఆధునిక పద్ధతిలో ఐఆర్‌డీఏ పోర్టు ద్వారా ఆటోమేటిక్ రీడింగ్ తీసే విధానాన్ని నూరు శాతం మీటర్లకు తీయాలని తెలిపారు. గత నెలలో విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని, కొంత మేరకు మాత్రమే ప్రగతి ఉందన్నారు. లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆదేశించారు. రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని అన్నారు. సమావేశంలో మైదుకూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీవీ రామిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజమే

రాజుపాళెం : ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమేనని హెచ్‌ఎం వేలంగ్ కుమార్ పేర్కొన్నారు. రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం హెచ్‌ఎం, పీడీ వెంకటసుబ్బయ్య, ఆయా పాఠశాలల పీడీల అధ్యక్షతన మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ ఎంపికల కోసం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఇక్కడ విన్నర్‌గా నిలిచిన వారంతా శనివారం నియోజకవర్గ స్థాయిలో ప్రొద్దుటూరులోని రాయలసీమ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరిగే పోటీల్లో పాల్గొనాలని పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై మాట్లాడుతున్న సచివాలయాల మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి

అట్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని సచివాలయాల మండల కన్వీనర్ మన్యం మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కమలకూరు సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగనన్న సురక్ష విధివిధానాలు, ముఖ్యమంత్రి ఇస్తున్న భరోసాపై వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

గోపవరం: మండలంలోని బుచ్చనపల్లెలో దళితుల శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు ఇమ్మానుయేల్, గౌస్‌పీర్, పిచ్చయ్య, మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్.రామాపురంలోని పొలం సర్వే నెంబర్ 1165లో బుచ్చనపల్లె దళితులు తరతరాలుగా శ్మశాన స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారన్నారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన కొందరు శ్మశాన స్థలాన్ని ఆక్రమించి వామిదొడ్లకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. శ్మశానానికి వెళ్ళేందుకు దారి లేకపోవడంతో దళితులు ఇబ్బందిపడుతున్నారన్నారు. వామిదొడ్లను తొలగించాలని బాధితులు అడిగితే దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం సబబు కాదన్నారు. దళితులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, దళితులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నాగులపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలోని వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇదే క్రమంలో గ్రామంలో ఇళ్లకు పరిమితమైన దీర్ఘకాలిక రోగులను సైతం పరీక్షించి వైద్యం అందిస్తామన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను, అక్కడి రికార్డులను వైద్యాధికారి పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, ఏఎన్‌ఎం ఆరోగ్య మేరి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నవరదాయపల్లెలో..

మండల పరిధిలోని మడూరు గ్రామ సచివాలయ పరిధిలోని చిన్నవరదాయపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 వరకు ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని వైద్యాధికారి కోరారు.

ఆర్టీసీ స్థలాల అద్దెకు ఆన్‌లైన్ వేలం

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ టి.గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో అధికారులు, వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మైదుకూరు బస్టాండ్ ఆవరణలో ఐదు ఖాళీ స్థలాలు ఉన్నాయని, జోన్ పరిధిలో 25 ఖాళీ స్థలాలున్నాయని ఆయన వివరించారు. ఖాళీ స్థలాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు అద్దె పద్ధతిలో ఆన్‌లైన్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. టెండర్ వేసేందుకు ఈ నెల 26న వరకు గడువు ఉందని, 27వ తేదీన టెండర్లను తెరుస్తామని పేర్కొన్నారు. అద్దె వివరాలను, టెండర్ ప్రక్రియను, నియమ నిబంధనలను ఆర్‌ఎం వ్యాపారులకు వివరించారు.